క్లుప్తంగా

సాలూర గ్రామ కాంగ్రెస్ నూతన కమిటీ ఎన్నిక

బోధన్: కాంగ్రెస్ పార్టీ సాలూర గ్రామ నూతన కమిటీని పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, బోధన్, సాలూర మండలాల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్న రవి సమక్షంలో ఎన్నుకున్నట్లు గురువారం పార్టీ నాయకులు తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అల్లె జనార్దన్, ఉపాధ్యక్షులుగా లోకప్పగారి లక్ష్మణ్, ఎస్కే వహీద్, ప్రధాన కార్యదర్శిగా సాక్కం ప్రశాంత్, కార్యదర్శిగా మద్దెల సాయిలు, కోశాధికారిగా నీరడి నగేష్, కార్యవర్గ సభ్యులుగా హోట్లప్ప, మోనగారి చిన్న రాజు, లక్ష్మణ్, కుమ్మరి మోహన్, సలహాదారులుగా ఇల్తెపు శారద శంకర్, అల్లె రమేష్, భయ్యన్ సురేష్ పటేల్, కన్నె అశోక్, లక్ష్మణ్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



వేల్పూర్: అంగన్‌వాడీ టీచర్లు ఆడపిల్లల సంరక్షణ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి రసూల్‌బీ పేర్కొన్నారు. వేల్పూర్ మండలం అంక్సాపూర్ రైతువేదికలో గురువారం మహిళా శిశు సంక్షేమ, వయో వృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బేటి బచావో- బేటి పడావో అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు ఆపాలని, స్కూల్ డ్రాపవుట్స్ లేకుండా చూడాలన్నారు. హెల్ప్‌లైన్‌ను ఏవిధంగా ఉపయోగించుకోవాలో తెలిపారు. సీడీపీవో జ్ఞానేశ్వరి, న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ డివిజనల్ మేనేజర్ శ్యాంసుందరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాల మంజూరు చేయడంపై హర్షం




రుద్రూర్: మండలానికి వ్యవసాయ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అక్బర్‌నగర్ శివారులోని వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన ద్వారం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ప్రస్తుతం ఇక్కడ వ్యవసాయ పాలిటెక్నిక్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలు కొనసాగుతున్నాయి. ఇదే ప్రాంతంలో వ్యవసాయ డిగ్రీ కళాశాల రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట అరుణ్, ఉపాధ్యక్షుడు నగేష్, తాజా మాజీ సర్పంచ్ గంగామణిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శవపేటిక అందజేత



రుద్రూర్: బొప్పాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు శవపేటికను గురువారం రుద్రూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్యాంసుందర్ పహడే అందజేశారు. గ్రామ కమిటీకి శవపేటిక అందించడం ఎంతో విలువైన సేవ కార్యక్రమమని గ్రామ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. జీపీ స్పెషల్ ఆఫీసర్ సంతోష్ రెడ్డి, విండో మాజీ వైస్ చైర్మన్ బాపూజీ లింగం, లయన్స్ క్లబ్ కోశాధికారి కేవీ మోహన్, సురేందర్, సురేష్, సంతోష్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

అంకాపూర్‌ను సందర్శించిన ట్రైనీ ఐఏఎస్



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని ట్రైనీ ఐఏఎస్ కిరణ్మయి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ కూలీలు, ఐకేపీ సిబ్బందితో సమావేశమై ప్రత్యక్షంగా మాట్లాడారు. అలాగే ఐకేపీ రుణాలపై మహిళలతో చర్చించారు. దీంతోపాటు గ్రామంలో బృహత్ పల్లె ప్రకృతి వనం, నర్సరీని పరిశీలించారు. అలాగే గ్రామంలో గల సీడ్ ప్లాంట్లలో విత్తన శుద్ధి ఎలా జరుగుతుందో గురడి రెడ్డి కాపు సంఘం మాజీ కార్యదర్శి కేకే భాజన్నను అడిగి తెలుసుకున్నారు. డీఎల్‌పీవో శివ కృష్ణ, ఎంపీడీవో సాయిరాం, ఏపీవో సురేష్, ఐకేపీ ఏపీఎం గంగారాం, కార్యదర్శి హారిక పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డం..ప్రజలకు నరకం

- బాల్కొండ మండల కేంద్రంలో పలు కాలనీలలో రోడ్ల పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు





బాల్కొండ మండల కేంద్రంలోని ఒకటో వార్డులో రోడ్డు మధ్యలో ఉన్న స్తంభం, ఇస్లాంపూర్ కాలనీలో..

బాల్కొండ: మండల కేంద్రంలో పలు కాలనీల్లో సీసీ రోడ్లపై మధ్యలోనే విద్యుత్తు స్తంభాలు ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్తంభాలను మరోచోటుకు తరలించకుండా సీసీ రోడ్లు వేసేస్తున్నారు. కాని వాటిని తొలిగించటానికి ఎప్పుడు కూడా అధికారులు ప్రయత్నించలేదు. ఫలితంగా రోడ్డు గుండా ప్రయాణించడం ఇబ్బందిగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన కాలనీల ఏర్పాటు సందర్భంగా వ్యవసాయ భూముల్లో వెంచర్లు ఏర్పాటు చేశారు. దీంతో గతంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు అలానే మధ్యలో ఉండిపోయాయి. ఉన్న విద్యుత్ స్తంభాలు ఇనుప స్తంభాలు కావడంతో విద్యుత్ షాక్ వచ్చే ప్రమాదం కూడా ఉంది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి వెంటనే స్తంభాలు తొలగించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

షిఫ్టింగ్ చార్జీలు చెల్లిస్తేనే..

రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను తొలిగించాలంటే ట్రాన్స్‌కోకు షిఫ్టింగ్ చార్జీ చెల్లిస్తేనే షిఫ్టింగ్ చేసే అవకాశం ఉంది. అందుకు స్థానిక అధికారులు ప్రతిపాదన పంపి తగిన చార్జీని ట్రాన్స్‌కోకు చెల్లించాలి. లేదంటే నేరుగా డిపార్టుమెంట్ నుంచి షిఫ్ట్ చేసే అవకాశం లేదు. షిఫ్టింగ్ చార్జీ ఎవరు చెల్లించాలి. గ్రామ పంచాయతీ పట్టించుకోవడం లేదు .ట్రాన్స్‌కో డిపార్ట్‌మెంట్ నుంచి చేసే అవకాశం లేదు. ఇలా సమస్య పరిష్కారం కాకుండానే ఉండిపోతుంది. పాలకులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చార్జీలు చెల్లించాల్సిందే

విద్యుత్ స్తంభాలను ఇతర చోటుకు తరలించటానికి కావాల్సిన చార్జీని చెల్లిస్తే మార్చే అవకాశం ఉంది. రోడ్డు నుంచి తీసి పక్కకు వేయాలన్నా ఆ ప్లాట్ యజమాని కూడా అంగీకరించాలి. చాలా చోట్ల ప్లాట్‌కు చెందిన యజమాని కూడా అంగీకరించడం లేదు. దీంతో సమస్య పరిష్కారం కావడం లేదు.

– శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఏఈ, బాల్కొండ

విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి



నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డికి విన్నవించిన కేజీబీవీ సిబ్బంది

ఆర్మూర్: ఆర్మూర్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కేజీబీవీల్లో విద్యార్థులు నేలపైనే పడుకుంటున్నారని వారికి అవసరమైన బెడ్లు మంజూరయ్యేలా చూడాలని ఆర్మూర్ కేజీబీవీ సిబ్బంది, విద్యార్థులు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డికి విన్నవించారు. ఆర్మూర్ పట్టణం పెర్కిట్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదిలో పిల్లలతో ప్రత్యేకంగా మాట్లాడారు. పాఠశాలలో ఉన్న సమస్యలు, విద్యార్థులతో సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు తదితర అంశాలపై విద్యార్థులను నేరుగా అడగడంతో వారు అన్ని సవ్యంగా ఉన్నాయని ఆయనకు తెలిపారు. అనంతరం కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ గంగామణితో కలిసి పాఠశాల ప్రాంగణంలో ఉన్న సమస్యలను నేరుగా చూసి తెలుసుకున్నారు. విశాలమైన క్రీడా మైదానం ఉన్నప్పటికీ మురికి నీరు నిలుస్తున్న తీరును గమనించి త్వరలో సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. తాను తన నియోజకవర్గంలో మొదట విద్య, వైద్యానికి ప్రాధాన్యతనిస్తానని పేర్కొంటూ అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తానని పేర్కొన్నారు.

ఛత్రపతి శివాజీకి పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ సుందరీకరణ పనులు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శివాజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన వీరత్వం గురించి ప్రజలకు వివరించారు. నాయకులు కలిగోట గంగాధర్, మందుల బాలు, దోండి ప్రకాష్, వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన బీజేపీ విజయ సంకల్ప యాత్ర



బోధన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు



జానకంపేటలో..

బోధన్/ఎడపల్లి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో రెండు రోజులుగా కొనసాగిన బీజేపీ విజయ సంకల్ప యాత్ర గురువారం ముగిసింది. తొలి రోజు రాత్రి బోధన్ పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బహిరంగ సభను నిర్వహించగా, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్, ఎంపీ ధర్మపురి అర్వింద్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. మరసటి రోజు స్థానిక ఎన్‌డీఎస్‌ఎల్ ఎదుట ఎంపీ అర్వింద్ మీడియాతో మాట్లాడారు. ఇక్కడ నుంచి యాత్ర ఎడపల్లి మండల కేంద్రం మీదుగా నిజామాబాద్ నగరానికి వెళ్లింది. ఎడపల్లి నుంచి నెహ్రూ నగర్ వరకు బీజేపీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. జానకంపేటలో బీజేపీ నేత పల్లె గంగారెడ్డికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘాల ప్రతినిధులు

బోధన్: రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని భారత రాష్ట్రపతిని కోరుతూ జాతీయ రైతు సంఘాల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కొత్త సోమశేఖర్ రావు ఆధ్వర్యంలో రైతులు గురువారం పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో ఆఫీసుకు చేరుకుని స్థానిక అధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సోమశేఖర్‌రావు మాట్లాడుతూ.. ఈ నెల 5 నుంచి 7 వరకు ఢిల్లీలో జాతీయ రైతు సంఘాల సమాఖ్య జాతీయ స్థాయి సదస్సుల్లో రైతుల సమస్యలపై చర్చించామన్నారు. దేశ వ్యాప్తంగా జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్‌ల ద్వారా రాష్ట్ర పతికి వినతి పత్రాలు పంపించాలని నిర్ణయించామని తెలిపారు. పురుగు మందులు, విత్తనాలు, ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు, పరికరాలపై జీఎస్టీని తొలగించాలని, పంటలకు కనీస మద్దతు ధర చెల్లించాలని కోరారు.

ఈవ్‌టీజింగ్ చేస్తే షీ టీమ్‌కు సమాచారం ఇవ్వాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వేల్పూర్: ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్‌టీజింగ్ చేసినా షీ టీమ్‌కు సమాచారం ఇవ్వాలని ఆర్మూర్ సబ్‌డివిజన్ షీ టీం కానిస్టేబుళ్లు విఘ్నేష్, సుమతి పేర్కొన్నారు. మోతె హైస్కూలులో గురువారం విద్యార్థినులకు సైబర్ క్రైమ్, ఈవ్ టీజింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేధింపులకు పాల్పడితే 8712659795కు లేదా 100కు ఫోన్ చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన మహిళలు, విద్యార్థినుల పేర్లు గోప్యంగా ఉంటాయన్నారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా షీ టీమ్ వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని విద్యార్థినులకు వివరించారు. హెచ్ఎం వైద్యగణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా శ్రీలక్ష్మి గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన



రుద్రూర్: మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం మూడు రోజుల పాటు వైభవంగా కొనసాగింది. ఆలయం ఎదుట ధ్వజ స్తంభం ఏర్పాటు చేశారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై ఆలయంలో పూజలు నిర్వహించారు. దాతలను సత్కరించారు.

నాగాలింగేశ్వరుడి విగ్రహం..



బాల్కొండ: నాగాపూర్‌లో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ తీరంలో నిర్మించిన నూతన ఆలయంలో గురువారం నాగాలింగేశ్వర స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ముందుగా వినాయకుడు, పార్వతి, నంది, నాగరాజు, శివలింగం విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. పల్గుట్ట మహరాజు మంగిరాములు ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజుల నిర్వహించారు.

పాత హనుమాన్ ఆలయంలో..



బోధన్‌రూరల్(బోధన్): పట్టణంలో చావిడి వద్ద నిర్మించిన పాత హనుమాన్ ఆలయ స్థానంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో హనుమాన్ సమేత శివ పంచాయతన స్థిర ప్రతిష్ఠా మహోత్సవాన్ని పట్టణాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. పట్టణాభివృద్ధి కమిటీ చైర్మన్ సింగం బాగారెడ్డి, కమిటీ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులున్నారు.

మారుతి మందిర్‌లో..



బోధన్‌రూరల్(బోధన్): పట్టణంలోని మారుతీ మందిర్‌లో నూతనంగా నిర్మించిన మండపంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గురువారం విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ మహరాజ్, ఈవో రవీందర్ గుప్తా, కౌన్సిలర్‌లు తూము శరత్ రెడ్డి, శ్రీకాంత్, నవ గ్రహ విగ్రహాల దాతలు, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వాములకు చక్రస్నానం



మాక్లూర్: మండలంలోని అపురూప వేంకటేశ్వర ఆలయంలో గురువారం వెంకటేశ్వర స్వాములవారికి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక నీటి కొలను వద్ద చక్రస్నానం చేయించారు. 8 రోజులపాటు జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాలు చక్రస్నానంతో ముగిశాయి. ఆలయ చైర్‌పర్సన్ అమృతలత, ప్రభాదేవి, రాజారెడ్డి, నరేందర్‌రెడ్డి, రమాదేవి, భక్తులు పాల్గొన్నారు.

నువ్వుల పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బాల్కొండ: నువ్వుల పంటలో వెంటనే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నువ్వుల పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఆకు ముడత, గొంగళి పురుగు నువ్వుల పంటలో పత్ర హరితాన్ని గీకి తినడం వల్ల పంట ఎదుగుదల ఆగిపోతుందన్నారు. నివారణ కోసం ఇమామెక్టిన్ బెంజాయెట్ 100 గ్రాములు లేదా క్లోరాంతర నిలిప్రోలు 60 మిల్లి లీటర్లు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏఈవో రేష్మా పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ దినోత్సవం



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ వేద హైస్కూల్‌లో గురువారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సైన్స్ ఫెయిర్‌ను కోటగిరి తహసీల్దార్ సునీత ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను తిలకించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి కార్యక్రమాలను పాఠశాలలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆర్‌ఐ సయ్యద్ హుస్సేన్, స్కూల్ డైరెక్టర్ తేల రవికుమార్, ప్రిన్సిపల్ తెల్ల అక్షర, ఉపాధ్యాయులు నిర్మల, షామిలి, రేష్మ దితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో కమిషనర్

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ 5 రోజుల పాటు వ్యక్తిగత సెలవులు తీసుకున్నారు. మార్చి 1 నుంచి 5 వరకు అందుబాటులో ఉండరు. ఈ విషయాన్ని ఉన్నత అధికారులకు ఆయన తెలియజేశారు.

వర్ని మండల సర్వసభ్య సమావేశం

వర్ని: వర్ని మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మేక శ్రీలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్ వెల్లడించారు. సమావేశానికి అధికారులు అభివృద్ధి పనుల నివేదికను తీసుకొని సకాలంలో హాజరు కావాలని సూచించారు. అధికారులు గైర్హాజరైతే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హెచ్చరించారు.

డొంకేశ్వర్ సొసైటీ వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం

- నేడు సమావేశం నిర్వహించనున్న డీసీవో

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) వైస్ చైర్మన్ రాజారెడ్డికి పదవీ గండం ఏర్పడింది. ఆయనపై అవిశ్వాసాన్ని కోరుతూ సొసైటీకి చెందిన ఏడుగురు డైరెక్టర్లు జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్‌కు ఇటీవల వినతిపత్రాన్ని అందజేశారు. డైరెక్టర్ల వినతి మేరకు మార్చి 1న(నేడు) సమావేశం నిర్వహిస్తున్నట్లు వైస్ చైర్మన్‌తో పాటుగా డైరెక్టర్లకు డీసీవో తెలిపారు. డొంకేశ్వర్ సొసైటీలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా, వైస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా తొమ్మిది మంది చేతులు పైకెత్తితే ఆయనపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గుతుంది. ఒకవేళ వైస్ చైర్మన్‌కు అనుకూలంగా ఎక్కువ మంది చేతులు ఎత్తితే అవిశ్వాసం వీగిపోతుంది. ఈ రెండింటిలో ఏది జరగనుందో శుక్రవారం ఉదయం 11 గంటలకు డొంకేశ్వర్ సొసైటీలో జరిగే సమావేశంలో తేలిపోనుంది.

ఆరోగ్య సేవలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న అశోక్



పాల్గొన్న డివిజన్‌స్థాయి వైద్యాధికారులు, సిబ్బంది

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వ ఆస్పత్రిలో అందించే సేవలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి అశోక్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో గల సి- కన్వెన్షన్ హాల్లో ఆర్మూర్ డివిజన్ స్థాయి ఆరోగ్యశాఖ సిబ్బంది, సూపర్‌వైజర్ స్థాయి, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు, వైద్యాధికారులకు హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం, ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధి గురించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వివిధ రకాల వ్యాధులపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం



బోధన్ పట్టణంలోని పరీక్షా కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారి రవి కుమార్



వర్నిలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ మోతి సింగ్

బోధన్‌టౌన్(బోధన్): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. బోధన్ పట్టణంలో 9 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ అధికారి రవికుమార్ తనిఖీ చేశారు. ఆయన వెంట పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ శివకుమార్ యాదవ్, డిపార్ట్‌మెంట్ అధికారి వినోద్‌కుమార్ ఉన్నారు.

పది మంది విద్యార్థుల గైర్హాజరు

వర్ని: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు పది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వర్ని జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ శ్రీనివాస్ వెల్లడించారు. 365 మంది హాజరయ్యారని తెలిపారు. వర్ని మండల కేంద్రంలో పరీక్షా కేంద్రాన్ని స్థానిక తహసీల్దార్ మోతి సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – మా ఊరి రాజారెడ్డి (తెలుగు) - 1.45
ఇంటి నెంబర్-13 (తెలుగు) - 4.15
ముఖ్య గమనిక (తెలుగు) - 7.00
కిక్ (తెలుగు) - 9.45

స్క్రీన్-2 – ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) - 12.15, 3.10, 6.05, 9.00

స్క్రీన్-3 – ఊరు పేరు భైరవకోన (తెలుగు) - 12.45, 10.00
హనుమాన్ (తెలుగు) - 3.45
ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు)-7.05

స్క్రీన్-4 – చారి-111 (తెలుగు) - 1.30, 7.20
భూతద్దం భాస్కర్ నారాయణ (తెలుగు) - 4.20, 10.10

గోదాం నిర్మాణం జరిగేనా..?



మాదాపూర్‌లో బేస్‌మెంట్ స్థాయిలో నిలిచిపోయిన గోదాం

మాక్లూర్: మాక్లూర్ వ్యవసాయ పరపతి సంఘం పరిధిలోని మాదాపూర్‌లో రూ.55 లక్షల వ్యయంతో చేపట్టిన గోదాం నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ పరపతి సంఘానికి కేవలం 2 కిలోమీటర్ల దూరంలోనే ఉన్న మాదాపూర్‌లో కొత్తగా గోదాం నిర్మించటం వృథా అంటూ అప్పట్లో పలువురు వ్యతిరేకించినా అప్పటి ఎమ్మెల్యే పనులు ప్రారంభించారు. డబ్బులు వృథా తప్ప పెద్దగా ప్రయోజనం ఏమీ ఉండదని రైతులందరూ కలిసి వ్యతిరేకించటమే కాకుండా డీసీవోకు ఫిర్యాదు కూడా చేశారు. గోదాం నిర్మాణం పేరుతో సొసైటీ డబ్బులు దండుకోవడానికే గోదాం నిర్మాణానికి శ్రీకారం చుట్టారనే విమర్శలు అప్పట్లో అప్పటి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఆయన అనుచరుడు రంజిత్‌పై భారీగా విమర్శలు వచ్చాయి. రైతుల విమర్శలకు బలం చేకూర్చేలా నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి టెండర్ వేయకుండానే ఏక పక్ష నిర్ణయంతో 2022 జులై 31న 1,500 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉంచగలిగేలా గోదాం నిర్మాణం ప్రారంభించారు. బేస్‌మెంట్ లెవల్ పనులు జరిగాయి. తిరిగి పనులు ప్రారంభం కావటం లేదు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పడిపోవటంతో పాటు గోదాం నిర్మాణానికి కర్త, క్రియగా వ్యవహరించిన ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఓడిపోవటంతో ఈ గోదాం నిర్మాణం పనులకు బ్రేకు పడినట్టు అయింది.కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి గోదాం పనులు కొనసాగిస్తారా లేక ఆపేస్తారా చూడాలి.